'గౌడ కులస్తులకు అండగా మజ్లిస్'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ ఆవిర్భావం నాటి నుంచి గౌడ కులస్తులకు అండగా ఉంటూ వస్తుందని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం కార్వాన్‌లో గౌడ కులస్తుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గౌడ కులస్తుల హక్కుల పరిరక్షణ కోసం జరిగిన పోరాటాల్లో తమ పార్టీ ముందు వరుసలో ఉందని అన్నారు. కేవలం గౌడ కులస్తులకే కాకుండా అణగారిన వర్గాలు, దళితులు, బీసీల పక్షాన కూడా ఆనాటి నుంచి నేటి వరకు పోరాటం చేస్తున్న పార్టీ తమదేనని ఆయన స్పష్టం చేశారు. మజ్లిస్‌లో అన్ని వర్గాల ప్రజలకు చోటు ఉందని, నేడు తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో సైతం మజ్లిస్ విస్తరించి ఉన్నదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు, మజ్లిస్ నాయకులు తదితరులున్నారు.



చార్మినార్ ముఖ చిత్రం మారేనా..?

- మజ్లిసేతర పార్టీలు సత్తా చాటనున్నాయా..
- సిట్టింగ్ ఎమ్మెల్యేకు టికెట్ దక్కకపోతే..
- మారుతున్న రాజకీయ పరిణామాలకు అనుగుణంగా..
- గత ఎన్నికల ఫలితాలు చూస్తే.. మజ్లిస్ పార్టీకి చార్మినార్ కంచుకోట



చార్మినార్: మారుతున్న రాజకీయ పరిణామాలకు అనుగుణంగా ఈసారి పాతబస్తీలో కూడా ఊహించని రాజకీయ పరిణాలు ఎదురవుతాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మజ్లిస్ పార్టీలో సిట్టింగ్‌లకు టికెట్లు లభించకపోతే.. పాతబస్తీ రాజకీయ ముఖ చిత్రం మారుతుందని అంటున్నారు. 2009, 2014, 2018 ఎన్నికల్లో మజ్లిస్ పార్టీతో మజ్లిసేతర పార్టీలు హోరాహోరీ ఎన్నికల పోరాటం చేసినప్పటికీ.. అంతిమ విజయం మజ్లిస్ పార్టీకే దక్కింది. చార్మినార్ నియోజకవర్గం నుంచి ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థుల పేర్లు ఖరారు కాగా.. మజ్లిస్ పార్టీతో పాటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల పేర్లు ఇంకా ఖరారు కాలేదు. ఈసారి సిట్టింగ్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్‌కు టికెట్ లభించదని ప్రచారాలు జరగుతుండడంతో.. ముంతాజ్ అహ్మద్ ఖాన్ కాకుండా మరెవరికి టికెట్ కేటాయిస్తారోనని చార్మినార్ నియోజకవర్గం మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు ఎంతో ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు. చార్మినార్ నుంచి మజ్లిస్ పార్టీకి దీటుగా తమ అభ్యర్థిని ఎన్నికల బరిలోకి దింపాలని కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో ప్రయతిస్నోంది. గత ఎన్నికలను పరిశీలిస్తే.. పార్టీలు ఎంత గట్టిగా పోటీ చేసినప్పటికీ.. చార్మినార్ మజ్లిస్ పార్టీకి కంచుకోట అనే విషయాన్ని ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

2018లో మజ్లిస్ పార్టీ ఘన విజయం..

2018 ఎన్నికల్లో చార్మినార్ నియోజకవర్గం నుంచి ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 16 మంది ఎన్నికల బరిలో ఉండగా.. మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగిన ముంతాజ్ అహ్మద్ ఖాన్ 53,522 ఓట్లు సాధించి బీజేపీ అభ్యర్థి టి. ఉమామహేంద్రపై 32,317 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు. బీజేపీ అభ్యర్థి ఉమా మహేంద్రకు 21,197 ఓట్లతో రెండో స్థానంలో నిలవగా... కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ గౌస్ 16,786 ఓట్లతో మూడో స్థానం దక్కించుకోగా.. అప్పటి టీఆర్ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గంలో తన ఉనికిని కోల్పోయే విధంగా ఇక్కడి చార్మినార్ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధి 6,101 ఓట్లతో నాలుగో స్థానానికి దిగజారిపోయాడు.

2014 ఎన్నికల్లో కూడా మజ్లిస్ పార్టీనే..

2014 ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ అభ్యర్థి సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ 62,941 ఓట్లతో విజయం సాధించి హ్యాట్రిక్‌గా నిలిచారు. ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి ఎం.ఎ.బాసిత్ 26,326 ఓట్లతో ద్వితీయ స్థానంలో, టీఆర్ఎస్ అభ్యర్థి మీర్ ఇనాయత్ అలీ బాక్రీ 8,275 తృతీయ స్థానంలో, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కె.వెంకటేష్ 5,598 ఓట్లతో నాలుగో స్థానానికి పరిమితమయ్యారు. ఈ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ అభ్యర్థి సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీకి 36,610 ఓట్ల మెజార్టీ లభించింది.

2009 ఎన్నికలలో కూడా..

2009లో జరిగిన ఎన్నికల్లో చార్మినార్ నియోజకవర్గం నుంచి మజ్లిస్ పార్టీ అభ్యర్థి సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రీ 43725 ఓట్లు సాధించి గెలుపొందారు. టీడీపీ అభ్యర్థి అలీ బిన్ ఇబ్రహీం మస్కతీ 33030 ఓట్లు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి అలీ బిన్ ఇబ్రాహీం మస్కతి గట్టి పోటీ ఇవ్వడంతో సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రీకి 10695 ఓట్ల మెజార్టీ మాత్రమే దక్కింది. కాంగ్రెస్ అభ్యర్థి బుచ్చిదాస్ గౌడ్ దాదాపు 5 వేల అతి తక్కువ ఓట్లు సాధించారు.

ఉచిత విద్య, వైద్యమే లక్ష్యం

గన్‌ఫౌండ్రీ: ప్రజలకు ఉచిత విద్య, వైద్యాన్ని అందించడమే తమ లక్ష్యమని జై మహాభారత్ పార్టీ జాతీయ అధ్యక్షుడు శ్రీ భగవాన్ అనంత విష్ణు ప్రభు తెలిపారు. బుధవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జై మహాభారత్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ మహిళల యుద్ధభేరి పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..119 స్థానాలలో 119 మంది మహిళలకు కేటాయించి ప్రపంచంలోనే రికార్డ్ సాధిస్తున్నట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో టికెట్లను ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పలు నియోజకవర్గాల అభ్యర్థులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'బీజేపీని గెలిపించుకోవాలి'



చార్మినార్: ఎన్నో ఏళ్ల తర్వాత చార్మినార్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా మొఘూరాణీ అనే ఉన్నత విద్యాభ్యాసం కలిగిన మహిళకు టికెట్ దక్కినందున తామంతా పూర్తిగా మద్దతు తెలియజేస్తున్నామని నార్నూల్ అగర్వాల్ సమితి హైదరాబాద్, సికింద్రాబాద్ అధ్యక్షులు పంకజ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. బుధవారం రికాబ్‌గంజ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈసారి బీజేపీ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

నామినేషన్ వేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటించాలి


వివరాలను వెల్లడిస్తున్న రిటర్నింగ్ అధికారి లావణ్య

నాంపల్లి: నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థులు నియమ నిబంధనలు పాటించాలని నాంపల్లి నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి లావణ్య పేర్కొన్నారు. బుధవారం నాంపల్లి నియోజకవర్గం ఎన్నికల కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన రిటర్నింగ్ అధికారి నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నవంబరు 3 నుంచి 10వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటలకు వరకు నామినేషన్లు వేయవచ్చని తెలిపారు. సెలవు దినాల్లో నామినేషన్ల స్వీకరించడం జరుగదని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాలని కోరారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం చుట్టూ వంద మీటర్ల మేర 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థితో పాటుగా గుంపులుగా ఆర్‌ఓ కార్యాలయానికి రావడానికి వీలుండదని చెప్పారు. అభ్యర్థితో పాటుగా నలుగురిని లోనికి అనుమతి ఉంటుందన్నారు. జనరల్ కేటగిరి వారు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ రూ.5వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎవరు ముందు వస్తే వారి నామినేషన్లు ముందుగా తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఆర్‌ఓ ఆంజనేయులు, ఏఆర్‌ఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని చూసి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలి



చాంద్రాయణగుట్ట: ప్రజా సంక్షేమ పాలన కొనసాగాలంటే బీఆర్ఎస్ పార్టీని బంపర్ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం మహిళా నాయకురాలు చెన్నయ్యగారి సరిత అన్నారు. జంగమ్మెట్‌లో బుధవారం ఆమె స్థానిక మహిళలతో సమావేశమై సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రం సస్యశ్యామలంగా మారిందన్నారు. మిషన్ కాకతీయ పథకంతో చెరువులు అలుగులు పారాయన్నారు. ముఖ్యంగా కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడ పిల్లలకు ఎంతో ఆసరాగా మారిందన్నారు. అనంతరం మహిళలు ఆమెను సన్మానించారు.

బీఆర్ఎస్ అభ్యర్థులకు రక్షణ కల్పించాలి



నాంపల్లి: ఎన్నికల్లో పోటీ చేసే బీఆర్ఎస్ అభ్యర్థులకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆ పార్టీ నేత గద్దం శ్రీనివాస్ యాదవ్ బుధవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. బీఆర్ఎస్ దుబ్బాక విధాన సభ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రాబోతోందనే కుట్రతోనే ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కాబట్టి బీఆర్ఎస్ అభ్యర్థులకు రక్షణ కల్పించాలి మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించడం జరిగిందని, ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

'వైద్యంతో పాటు పౌష్టికాహారం ముఖ్యమే'


ప్రశంసా పత్రాలు అందజేసిన డాక్టర్ నాగేందర్ తదితరులు

అఫ్జల్‌గంజ్: రోగి సత్వరమే కోలుకునేందుకు వైద్యంతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం (డైట్) ఎంతో అవసరమని ఉస్మానియా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ అన్నారు. ఆస్పత్రిలో పౌష్టికాహార (డైటిక్స్) విభాగం ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయ ఎమ్మెస్సీ న్యూట్రిషియన్ విద్యార్థినులు నెల రోజుల ఇంటర్న్‌షిప్ ఉస్మానియా ఆస్పత్రిలోని డైటిక్స్ విభాగంలో పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆస్పత్రిలోని సూపరింటెండెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినులకు ధ్రువీకరణ, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ-1 డాక్టర్ శేషాద్రి, ఆర్ఎంఓ డాక్టర్లు బండారి శ్రీనివాస్, విజయ్ భాస్కర్, సుష్మ, కవిత, సహాయ సంచాలకులు నెహ్రూ, డైట్ ఎస్ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

'ఎంపీపై కత్తితో దాడి చేసింది కాంగ్రెస్ వ్యక్తే'


మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు

అబిడ్స్: బీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ వ్యక్తి కత్తితో దాడిచేసి అంతమొందించేందుకు ప్రయత్నించాడని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆరోపించారు. ఎంపీ ప్రచారం చేస్తుండగా కాంగ్రెస్ వ్యక్తి అతడిపై కత్తితో దాడిచేసి చంపేందుకు ప్రయత్నించాడంటే కాంగ్రెస్ నాయకుల నీచ రాజకీయం బహిర్గతమైందన్నారు. ఎంపీపై దాడిచేసిన వారిని కఠిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా ఆర్డీఓకు నందకిశోర్ వ్యాస్ బిలాల్ గోషామహల్ నియోజకవర్గం నాయకులతో కలిసి మెమోరాండం అందజేశారు. అనంతరం గోషామహల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీది పిరికిపందల చర్య అని ఆరోపించారు. గత పదేళ్లుగా ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో చిచ్చుబెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోషామహల్ నియోజకవర్గంలో ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తామన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్‌ను చిత్తుగా ఓడిస్తామన్నారు. పదేళ్లలో చిల్లిగవ్వ కూడా అభివృద్ధి చేయని రాజాసింగ్‌కు ఇక ఇంటికి పంపడమే మిగిలిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జయశంకర్, శంకర్‌సింగ్ జమేదార్, అనిత, ఫయూమ్ తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ శక్తులను ఓడించాలి


మాట్లాడుతున్న అమర్‌సింగ్

గోల్కొండ: మతతత్వ శక్తులు, పార్టీలకు బొందపెట్టాలని కార్వాన్ బీజేపీ అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్ గోల్డెన్ ప్యాలెస్ చౌరస్తా వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, ముస్లిం మైనార్టీలను మాయమాటలతో మోసం చేస్తూ పబ్బంగడుపుకుంటున్న మజ్లిస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం నేర్పడం ఖాయమని అన్నారు. హైదరాబాద్ నగరం ఆధునీక నగరంగా మారిందని అయితే పాత నగరంలో ఒకసారి పర్యటించి చూస్తే ఆ పార్టీ పాతనగరానికి చేసిందేమి లేదన్న విషయం స్పష్టమవుతుందన్నారు. ఏదేమైనా తెలంగాణలో ఈసారి భారీ మెజార్టీతో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ పరిశీలకుడు నందకుమార్‌యాదవ్, డిజ్వర్‌సింగ్, ఆకుల గోవర్దన్, ఇంద్రసేనారెడ్డి, సచిన్‌కామ్లేకర్, జగత్‌సింగ్ తదితరులున్నారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఖండించాలి


ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఫుట్‌బాల్ క్రీడాకారులు


గోల్కొండ: ఇజ్రాయెల్ కొన్ని ప్రపంచ అగ్రదేశాలతో కలిసి పాలస్తీన, గాజాపై చేస్తున్న సైనిక దాడులను ప్రతిఒక్కరూ ఖండించాలని ప్రముఖ ఫుట్‌బాల్ కోచ్ సఫ్దర్‌పాషా అన్నారు. బుధవారం గోల్కొండ రిసాల బజార్‌లో ఆయన పలువురు ఫుట్‌బాల్ క్రీడాకారులతో కలిసి ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఇజ్రాయెల్ ప్రధాని నేతన్యాహూ యుద్ధ ఉన్మాది అని ఆరోపించారు. గాజాలోని పాలస్తీన ప్రజలను మట్టుపెట్టడానికే ఆయన గాజాపై వైమానిక దాడులతో పాటు డ్రోన్‌లతో దాడులు చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్, యాకూబ్ అబీబ్, మహ్మద్ తదితరులున్నారు.

పూల్‌బాగ్‌లో 'హలో మాల–చలో బస్తీబాట'


కార్యక్రమంలో చైర్మన్ చెన్నయ్య, మాజీ కార్పొరేటర్ మమతాగుప్తా

అబిడ్స్: 'హలోమాల–చలో బస్తీబాట'కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర మాల పోరాట సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చేపట్టారు. గోషామహల్ నియోజకవర్గంలోని పూల్‌బాగ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ముందుగా పూలమాలలు వేసి అనంతరం ఈ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మాల పోరాట సమితి చైర్మన్ జి.చెన్నయ్య మాట్లాడుతూ..మాలలను అణచివేసే దోరణిలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని అంటున్న రాజకీయ పార్టీల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాలలకు ప్రభుత్వ పథకాల అమలులో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాలలకు 10 అసెంబ్లీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇళ్లులేని ప్రతి దళిత కుటుంబానికి డబుల్‌బెడ్‌రూమ్ ఇవ్వాలని, ప్రతి దళితులకు మూడు ఎకరాల భూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. భాగ్యరెడ్డి వర్మ, ఈశ్వరీబాయి, గద్దర్, పీవీ.రావ్ విగ్రహాలను ప్రభుత్వం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, బలవంతరావు, కరణం కిషన్, మన్నే రంగ, రఘురాం, అంజలి, మారుతి, మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: ప్రతి ఒక్కరి జీవితంలో తండ్రికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంటుందని ప్రభుత్వ సలహాదారులు కేవీ రమణాచారి అన్నారు. బుధవారం రవీంద్ర భారతిలో లేఖిని రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి రచించిన కాలం మింగిన కలం పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..రచయిత్రి తన తండ్రి జ్ఞాపకాలను రచనల రూపంలో అద్భుతంగా రచించారని కొనియాడారు. దూరదర్శన్ పూర్వ సంచాలకులు మధుసూదన్‌రావు, విశ్రాంత శాస్త్రవేత్త అత్తలూరి గంగాధర్‌రావు, సంస్థ ముఖ్య సలహాదారులు భానుమతి, గౌరవ అధ్యక్షులు టి.జానకి, కవయిత్రి శీల సుభద్రదేవి పాల్గొన్నారు.

4న సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

జియాగూడ: శ్రీ వాసుదేవానంద భారతిస్వామి వారి సంకల్పంతో ఈనెల 4న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 1016 మందితో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని జియాగూడ సమర్థ నారాయణ మహారాజ్ ఆశ్రమంలో నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ ప్రతినిధి ప్రభుదత్త మహారాజ్ తెలిపారు.

నూతన కార్యవర్గానికి సన్మానం



అబిడ్స్: వాసవీ సేవా కేంద్రం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కొల్నూర్ రమేష్ గుప్తాతో ఇతర నాయకులను ఘనంగా సత్కరించారు. లక్డీకాపూల్‌లోని వాసవీ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఉప్పల వరకుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శి మంచాల అంబరీష గుప్తా, కోశాధికారి అడ్డగుళ్ల వెంకటేష్‌గుప్తా ఆధ్వర్యంలో జరిగిన 6వ కార్యవర్గ సమావేశంలో వాసవీ సేవా కేంద్రానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు కొల్నూర్ రమేష్‌గుప్తా, పలువురు నాయకులను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫ్‌నగర్‌లో రూ.21.50 లక్షల స్వాధీనం

విజయనగర్‌కాలనీ: 3సీ ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ఆసిఫ్‌నగర్ కూడలిలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. జీన్సీచౌరాహి సాయిబాబ టెంపుల్ మంగళ్‌హాట్‌కు చెందిన నిఖిల్‌భంగ్(34) తన కారులో వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. ప్లాస్టిక్ బ్యాగ్‌లో రూ.21.50 లక్షల నగదు ఉన్నట్లు కనుగొన్నారు. నగదుకు సంబంధించిన ఎటువంటి పత్రాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం ఆసిఫ్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

రేతిబౌలిలో సుభాన్ బేకరీ ప్రారంభం



గోల్కొండ: రేతిబౌలిలో సుభాన్ బేకరీ కొత్త షోరూమ్‌ను బేకరీ మేనేజింగ్ డైరెక్టర్ సయ్యద్ ఇర్ఫాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర వాసులకు బేకరీలో తయారైయ్యే వివిధ రకాల బిస్కెట్లు, అల్పాహార వంటకాలను అందించిన ఘనత తమదేనని ఆయన అన్నారు. స్వచ్ఛమైన నెయ్యి, డ్రైఫ్రూట్స్‌తో తాము తయారు చేసే దమ్‌కే రోట్‌లకు పలు దేశాలకు తాము ఎగుమతి చేస్తున్నామని ఆయన అన్నారు.

పాతబస్తీలో ఉత్సవాలు మత సామరస్యానికి చిహ్నాలు



చార్మినార్: పాతబస్తీలో ఉత్సవాలు మత సామరస్యానికి చిహ్నాలుగా నిలుస్తాయని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ భాక్రీ అన్నారు. హైదరాబాద్ కుల్ హింద్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం మొఘల్‌పురాలో దసరా సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ మాట్లాడుతూ.. పాతబస్తీలో ఇరువర్గాల ప్రజలు ఉత్సవాలను కలిసిమెలిసి నిర్వహించుకోవడం తరతరాలుగా వస్తోందన్నారు. సయ్యద్ ఫయాజుద్దీన్, సత్తార్, వీరమణి తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్‌బోర్డు యూనిట్‌కు సన్మానం



అబిడ్స్: హౌసింగ్‌బోర్డు యూనిట్‌కు ఎన్నికైన నూతన కమిటీని టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో సత్కారం చేశారు. యూనియన్ కార్యాలయంలో అధ్యక్షుడు జీవీ రమణారెడ్డి, ఉపాధ్యక్షుడు సీహెచ్. సంజీవరెడ్డి, కార్యదర్శి జగదీశ్వర్‌రావు, సంయుక్త కార్యదర్శి రామ్‌కుమార్, ప్రణయ్, కోశాధికారి రఘురామ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరి అజ్మీర రాంబాబు, అబ్దుల్ సలీం, కార్యనిర్వాహక సభ్యులు మహ్మద్ అబ్దుల్ ముక్తదర్, సాయివర్ధన్, మహ్మద్ రహీం, భాగ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు, నీరంజన్‌రెడ్డి, సజ్జాఉద్దీన్, మల్లేష్‌లకు సత్కారం చేసి డాక్టర్ ఎస్ఎం. ముజీబ్ హుస్సేని అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ..అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులకు తమ యూనియన్ అండగా ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు.

సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

గోల్కొండ: సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని కార్వాన్ యాదవ సంఘం అధ్యక్షుడు బోడి అశోక్‌కుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం కార్వాన్ యాదవ సంఘం సమావేశం శ్రీ కృష్ణ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా సదర్ ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. అనంతరం అధ్యక్షుడు బోడి అశోక్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. సదర్ ఉత్సవాలు యాదవ ఉత్సవాలకే తలమానికమని అన్నారు. గతంలో కంటే ఈ సంవత్సరం భారీ ఎత్తున ఈ ఉత్సవాలను నిర్వహిస్తామని ఆయన అన్నారు. మల్లేష్, అనుయాదవ్, సందేశ్‌యాదవ్, సుధాకర్ యాదవ్, గోదా మధుసూదన్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.

స్వప్న హత్య కేసులో మరో నిందితుడికి రిమాండ్?


సురేశ్

సంతోష్‌నగర్: చంపాపేట్ గత నెల 28న జరిగిన స్వప్న హత్య కేసులో మరో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు విశ్వసనీయమైన సమాచారం. వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా పెద్దపూర్ మండలం నాయినికుంట తండాకు చెందిన నరేశ్ నగరానికి వచ్చి బీఎన్‌రెడ్డినగర్ వినాయక్‌నగర్‌లో నివాసముంటూ ఆటో నడుపుతున్నాడు. తన ఆటోలో ప్రయాణించే స్వప్నతో పరిచయం కాస్తా ప్రేమగా మారింది. అనుకోకుండా నెల క్రితం మహేశ్వరం ప్రాంతానికి చెందిన టీ స్టాల్ నిర్వహించే ప్రేమ్ కుమార్ స్వప్నతో పరిచయం చేసుకొని వివాహం చేసుకున్నాడు. వివాహైన అనంతరం స్వప్న నడవడికపై అనుమానం రావడంతో ప్రేమ్‌కుమార్ మందలించాడు. ఇందులో భాగంగా గత నెల 28న స్వప్నతో సురేశ్ సన్నిహితంగా ఉండటాన్ని చూసిన ప్రేమ్‌కుమార్ ఆవేశంతో స్వప్నను కత్తితో పొడిచి హత్య చేశాడు. హత్య చేసిన అనంతరం ప్రేమ్‌కుమార్ బయటికి రావడంతో సురేశ్, ప్రేమ్ కుమార్‌ల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో ప్రేమ్‌కుమార్‌ను భవనంపై నుంచి తోసేసిట్లు విశ్వసనీయమైన సమాచారం. దీంతో పోలీసులు సురేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం.